ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 09 ఏప్రిల్, 2024 | పేజీలు : 06

## గవర్నర్‌ను కలిసిన ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్సలర్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. నీరజా ప్రభాకర్ సోమవారం తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ములుగులోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో 3వ స్నాతకోత్సవం నిర్వహణకు సాధ్యమైన తేదీలను ఇవ్వాలని రాష్ట్ర గవర్నర్‌ను ఈ సందర్భంగా ఆమె అభ్యర్థించారు..

# తాగునీటి సమస్య రాకుండా చూడండి..

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** వేసవి పూర్తి అయ్యే వరకు పక్కా ప్రణాళికతో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి మిషన్ భగీరథ, ఇంట్రా, మునిసిపల్, విద్యుత్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ, ఎంపిఓలతో జిల్లాలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం త్రాగునీటి సరఫరా పర్యవేక్షణకై రాష్ట్ర స్థాయి అధికారులను జిల్లాలకు నియమించిందని, దీన్ని బట్టి త్రాగునీటికి ఎంత ప్రాధాన్యత నిస్తుందో మనందరం గమనించాలని అన్నారు. జిల్లా యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణతో త్రాగునీటి సరఫరాపై ముందుకు వెళుతున్నదని, ఎక్కడెక్కడ సమస్యలు వస్తున్నాయో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడు తున్నారని అన్నారు. నీటి సరఫరా పైప్ లైన్ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను తన దృష్టికి తేవాలని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి అధికారి నుండి గ్రామ స్థాయి సిబ్బంది వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ప్రతి వారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి త్రాగునీటి సరఫరాపై సమీక్షలు చేస్తున్నారని, అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం అనుకున్న దానికంటే తక్కువ వర్షపాతం నమోదైనందున మంచినీటి వనరుల్లో నీరు తగ్గిపోయి. మంచినీటికి సమస్య ఏర్పడిందని అన్నారు. రానున్న రెండు నెలలు మంచినీటి సరఫరాకు అత్యంత కీలకమని నిరంతర పర్యవేక్షణతో మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రిడ్, బోర్ వెల్స్ సమస్య వచ్చినా ప్రత్యాన్మయంగా మంచినీరు సరఫరా జరగాలని అందుకు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని అన్నారు. అదనంగా నీటినిం వినియోగిస్తున్న ప్రాంతాలల్లో నియంత్రణ చర్యలు చేపట్టేందుకు గేట్ వాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా జిల్లాలో త్రాగునీటి సరఫరాపై వివరించారు. జిల్లాలోని ఒక మున్సిపాలిటీ, 241 గ్రామ పంచాయతీలకు భీం గన్ పూర్ (గొల్ల బుద్దారం), రామప్ప, గన్ పూర్, భీం గన్పూర్ (కోనం పే) పంప్ హౌస్ లు ద్వారా త్రాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రెండు నెలలు నీరు సరఫరా చేసేందుకు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో సమ్మర్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీని 6 జోన్లుగా

తరువాయి 6లో



## పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



### కలెక్టర్ పి. ప్రావీణ్య

**ప్రజాపక్షం/వరంగల్‌ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓ వాసంతి, డీఆర్‌డిఓ కౌసల్యాదేవిలతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి సంబందించి అమ్మా ఆదర్శ కమిటీల ఆద్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేసి త్వరితంగా పనులు చేపట్టాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలలో మౌళిక వసతులు పూర్తి అయ్యే విదంగా చూడాలని అన్నారు. కమిటీల ఆద్వర్యంలో 25వేల రూపాయల లోపు చిన్న చిన్న పనులకు మరమ్మతులు,టాయిలెట్‌లు, విద్యుత్ సరఫరాల ఇబ్బందులు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి పని ప్రారంభించే, పూర్తయ్యే సమయాన్ని ఖచ్చితంగా పేర్కొనాలని, రాగల 15 రోజులలో ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలలో విద్యుత్, నీరు, టాయిలెట్ మొదలకు పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్షలో లీడ్ బ్యాంక్ ఆఫీసర్ రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈ, ఏఈలు, ఎంఈఓలు, ఏపీఎంలు,ఎమ్మెన్‌ఓలు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/కౌడిపల్లి:** మండలం మహమ్మద్ నగర్, కన్నారం గ్రామాల్లో సోమవారం మెదక్ జిల్లా త్రాగునీటి ప్రత్యేక అధికారిని, ఆర్కియాలజీ డైరెక్టర్ భారతి హోలీ కేరి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజుతో సందర్శించారు. ఈ సందర్భంగా త్రాగునీటి ప్రత్యేక అధికారిని,ఆర్కియాలజీ డైరెక్టర్ భారతి హోలీ కేరి మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. గ్రామాల్లో, మండలాల్లో, మున్సిపాలిటీల్లో త్రాగునీటి ఎద్దడి లేకుండా అధికారుల చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీటి పంపిణీలో సమస్యలు ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వేసవిలో త్రాగునీటి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తో ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తాసిల్దార్ ఆంజనేయులు, డిఎల్‌పిఓ యాదయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ కిషన్, డిపిఓ యాదయ్య, ఏఈ అరవింద్, ఆర్‌ఐ శ్రీహరి, పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్, నాయకులు మహిపాల్ రెడ్డి, బాలా గౌడ్, బురిగారి కృష్ణ, కారోబార్ వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలంలోని శంభునిపల్లి గ్రామానికి చెందిన మోడెం రాజ్ కుమార్ గత కొద్ది రోజులుగా అనారోగ్య బారిన పడగా హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో 20 లక్షల వ్యయంతో చికిత్స జరిపించినప్పటికి రాజ్ కుమార్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో పేద కుటుంబానికి చెందిన రాజ్ కుమార్ కు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని మాజీ గ్రామ సర్పంచ్ పెండ్యాల రవీందర్ రెడ్డితో పాటు గ్రామస్థులు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి విజ్ఞప్తి చేసి వేడుకున్నారు. అదే విధంగా మండలంలోని అంబాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రావణ్ తండ్రి మృతి చెందడంతో కౌశిక్ రెడ్డితో పాటు మండల ప్రజా ప్రతినిధులు అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ అంత్యక్రియల్లో జడ్‌పిటిసి కళ్యాణి లక్ష్మణ్ రావు, సింగిల్ విండో డైరెక్టర్ తక్కళ్ళపల్లి సత్యనారాయణ రావు, మాజీ జడ్‌పిటిసి నవీన్ కుమార్, ఆయా గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉగాది సందర్భంగా లీడ్ చిల్డ్రన్స్ లైబ్రరీలో బాల కవి సమ్మేళనం

**ప్రజాపక్షం/నర్సంపేట:** ఉగాధి పర్వదినం సందర్భంగా నేడు (మంగళవారం) లీడ్ చిల్డ్రన్స్ లైబ్రరీలో బాల కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు కవి, లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాసుల రవి కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం ఆరుగంటలకు లీడ్ లైబరీ, లిటరరీ సెంటర్‌లో బాలకవులు, సాహితివేత్తలతో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, సీనియర్ కవులు, కవిత్వం, తెలుగు భాష నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి మెలకువలు వివరిస్తారని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు 7981068048 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాసుల శోభారాణి, కేతిడి యాకుబ్‌రెడ్డి, శిల్పా జగదీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తాం



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యంను రోడ్లపై ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని వెల్దుర్తి ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు... రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల కుకునూర్ గ్రామం వద్ద మనేపల్లి గ్రామానికి చెందిన దుబాషి రఘుపతి రోడ్డుపై ఆరబోసిన ధాన్యంకు ద్విచక్ర వాహనంతో ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. అలాగే అదే గ్రామం వద్ద మరి కొంత మందికి అదుపు తప్పి తీవ్ర గాయాలు కావడం జరిగిందన్నారు. రైతులు ధాన్యం రోడ్డుపై ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని, ఇప్పటివరకు రోడ్లపై ఆరబోసిన ధాన్యంను వెంటనే తీసివేయాలని లేని తరుణంలో సంబంధిత వ్యక్తులపైన కేసులు నమోదు చేయడం ఎస్ఐ హెచ్చరించారు.

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

**ప్రజాపక్షం/తొర్రూరు:** మహబాదు జిల్లా తొర్రూరు పట్టణంలోని ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని తొర్రూరు మున్సిపల్ కమీషనర్ పి. శాంతి కుమార్ అన్నారు. సోమవారం తొర్రూరు మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తొర్రూరు పురపాలక ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు, తొర్రూరు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజలు దీనికి సహకరించాలన్నారు. వేసవిలో పట్టణ దాహర్తి సమస్య లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో 4 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయని, వాటికి నిత్యం 4.9 ఎంఎల్‌డి నీటి డిమాండ్ ఉండగా 3.03 ఎంఎల్‌డిల వరకు అందిస్తున్నామని, వాటికి తోడుగా ఒక పురపాలక ట్యాంకర్ అందుబాటులో ఉందన్నారు. రెండు బావుల ద్వారా 2ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు నీటిని నింపి సరఫరాకు సిద్ధం చేశామన్నారు. ఇంకా ఏమైన వార్డులలో నీటి సమస్య ఉంటే మా దృష్టికి తీసుకరావాలన్నారు. పట్టణ ప్రజల సహకారంతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## సర్వర్ ఉద్యమస్ఫూర్తిని కొనసాగిద్దాం



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** పేదరిక నిర్మూలన, సమానత్వం కోసం ఉద్యమించి ప్రాణత్యాగం చేసిన ఎంసిపిఐ(యూ) నేత కామ్రేడ్ ఎండి సర్వర్ ఆశయాలతో పాటు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దామని సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ సభ్యుడు మామిడిపల్లి రమేష్ అన్నారు. పీడిత ప్రజల అభ్యున్నతికై పోరాడిన ఉద్యమనేత కామ్రేడ్ ఎండి సర్వర్ 37వ వర్థంతి సందర్భంగా సోమవారం రామచంద్రపురం గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద కుటుంబ సభ్యులు, సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ సభ్యులు గ్రామస్తులు కలిసి పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. అనంతరం సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఆధ్వర్యంలో ములుగు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ అణగారిన వర్గాల, సాయుధ రైతాంగ ప్రజల కోసం త్యాగధనుడు ఎండి సర్వర్ చేసిన సేవలు మరువలేవివని, పేదరిక నిర్మూలనకు కోసం నిరంతరం ఉద్యమించిన సర్వర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా చిరస్మరణీయులుగా నిలిచారని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సర్వర్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలం లోని పోతిరెడ్డిపల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు ఉడుగుల బిక్షపతి భార్య ఉడుగుల రామాతర ఆనారోగ్యంతో మరణించగా సోమవారం వారి భౌతిక కాయానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈరెడ్డీ నర్సింహ రెడ్డీ, నర్సయ్య, మహేందర్, భాస్కర్, ఎల్లయ్య, అశోక్, ఏల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నర్సంపేట:** ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని మున్సిపాలిటి ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని 22వ డివిజన్‌లోని తాజ్ కుర్సీదా మసీద్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములసాంబయ్యగౌడ్ హాజరై ప్రసంగించారు. ముస్లీం సోదరులతో గత 40 సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో సత్సంబంధాలతో గడుపుతున్నామని, ప్రతి రంజాన్ మాసానికి వారితో కలిసి దాదాపు పది సంవత్సరాలుగా ఇఫ్తార్ విందులో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ మాసంలో ముస్లీం పవిత్ర ఉపవాసాలతో పాటు ఐదుపూటల నమాజ్‌ను అలపిస్తూ భక్తిశ్రద్ధలతో అల్లాను ప్రార్థిస్తారని, రంజాన్ నెల ఆరంభం నుండి మళ్లీ నెలవంక వచ్చే వరకు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, జాగరణలు చేశారు. ఈకార్యక్రమంలో మోల్ సాబ్ సాహెబ్‌రాజా, ఎండి అఖిల్‌పాష, ఖలీల్, జలీల్, మహబూబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం, సినియర్ నాయకులు దండెం రతన్‌కుమార్, నాంపల్లి వెంకటేశ్వర్లు, ఉత్తమ్‌కుమార్, తొగరు దేవేందర్, జిజుల కార్తీక్, దేశి సందీప్, రాసమల్ల బాలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో, మండలంలోని ఊకల్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పాక్స్ సిఈఓ సోమి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంట దళారులకు అమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐత మల్లేష్, రాకేష్, రైతులు రామచంద్ర రెడ్డి, రాజి రెడ్డి, రాజు, బొమ్మీర శ్రీను, పాపిడికాయల ఎల్లయ్య, పిరణి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టండి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ప్రజాసమస్యలపై చట్టసభలలో గలమెత్తే వ్యక్తికి, ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టాలని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల ఇంచార్జి సుంచు విజేందర్ అధ్యక్షతన జరుగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మనువాద సిద్ధాంతాన్ని అమలుచేయాలని చూస్తున్న బీజేపి ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థి గెలిస్తే ఈ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపి అధికారం చేపట్టిన గత పది సంవత్సరాల కాలంలో దళితులు, గిరిజనులు, మహిళలు అనేక దాడులకు గురవుతున్నారని, వారిపై హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆవేధన వెలిబుచ్చారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంపై సమగ్ర అవగాహనతో ఉన్నామని అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే సీపీఎంను పార్లమెంటుకు పంపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సీపీఎం మండల కమిటి సభ్యులు రామగల్ల అశోక్, మండల నాయకులు అన్నెబోయిన రాజు, పర్వతం నర్సింహులు, కడకంచి బాలరాజు, శోభ, తాడెం రాములు, పోచయ్య, పాల్గొన్నారు.

## తొర్రూరు అంగడిలో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/తొర్రూరుః** మహబాదు జిల్లా తొర్రూరు పశువుల అంగడిలో మౌళిక వసతులు కల్పించాలని సీపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. సోమవారం సీపిఎం తొర్రూరు పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ ఆద్వర్యంలో తొర్రూరు పశువుల అంగడిలో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ తొర్రూరు మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్యకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ మహబాదు జిల్లాలో రెండవ అతి పెద్ద అంగడిగా పేరుగాంచిన తొర్రూరు అంగడిలో కనీస వసుతులు లేవని, అంగడికి వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అవి నిరుపయోగంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తొర్రూరు అంగడికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి అనేక మంది వ్యాపారులు, ప్రజలు వస్తుంటారని, తొర్రూరు మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో ఆధాయం సమకూరినా మౌళిక వసుతులు కల్పించడం లేదన్నారు. అంగడి చుట్టూ ప్రహారీ గోడ లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నదన్నారు. ఇప్పటికైన అంగడిలో మౌళిక వసతులు కల్పించి ప్రజలకు, వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలోసాంబయ్య, స్వామి, దర్గయ్య, రవి, పాల్గొన్నారు.

# నాచగిరి క్షేత్రంలో వైభవంగా స్వామివారి వివాహన రథోత్సవం

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రసిద్ధ నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్ర నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి విమాన రథోత్సవం అత్యంత



వైభవంగా జరిగింది. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ నేతృత్వంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య రథప్రతిష్ట నిర్వహించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విమాన రథం పైకి సతీసమేతులైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారిని అధిష్టింపజేశారు. సోమవారం తెల్లవారు జాము వరకు భక్తులు స్వామివారిని దర్శించి మొక్కులు చెల్లించు కోవడంతోపాటు హరిద్రా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య స్వామి వారి విమాన రథాన్ని నాచగిరి పురవీదుల్లో ఊరేగించగా, విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా స్వామి వారి విమాన రథోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన భజన, ఆధ్యాత్మిక, మహిళల కోలాటాలు, కళాకారుల నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గౌరారం రూరల్ సిఐ మహేందర్ రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు శివకుమార్, విజయకుమార్, ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో



**ప్రజాపక్షం/మల్హర్:** జయశంకర్ జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల, వల్లెంకుంట గ్రామపంచాయతీ ఆవరణంలో మండల ప్రత్యేకాధికారి అవినాష్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ శ్యాంసుందర్ తాడిచర్ల, హనుమాన్ సెంటర్ లో వేసవి ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణికులకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహన్ని తీర్చడానికి చల్లని నీటిని అందు బాటులో ఉంచామని దీనిని అందరు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యదర్శి మల్లికార్జున్, కారోబార్ జీపీ సిబ్బంది గ్రామప్రజలు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ పూజలు



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో సోమవారం సోమవతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరేష్, ఆయనను సాధారంగా ఆహ్వానించి అభిషేకం అర్చన నిర్వహించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా సురేష్

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మండల అధ్యక్షునిగా బెల్లంపెల్లి సురేష్ ఎన్నికయ్యారు.సోమవారం మండలకేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వివిధ కుల సంగాల నాయకులు పాల్గొని అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా బెల్లంపెల్లి సురేష్,ఉపాధ్యక్షుడిగా దుర్గం పోషన్న,ప్రధాన కార్యదర్శిగా గడ్డం స్వామి,కోశాధికారిగా మెరుగు లక్ష్మ ణ్,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కాల్నేని రాములు,సంయుక్త కార్యదర్శి గా పంతకాని శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు బెల్లంపెల్లి సురేష్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం అభినందనీయమని,ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు.సమాజంలోని అసమానతలను తొలగించడానికి అందకీ ఆమోదయోగ్యమైన చట్టాలను అందించిన మహానీయుడని అన్నారు.పేద ధనిక అనే భావం లేకుండా ప్రతి ఒక్కరూ సమానమనే భావన కల్పించేందుకు కృషి చేసారని అన్నారు.ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా బిజెపి మీడియా కో కన్వీనర్‌గా హరీష్ పాటిల్ నియామకం



**ప్రజాపక్షం/జహీరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాడానికి వ్యూహాత్మకంగా ముందు అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. సోమవారం సంగరెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి చేతుల మీదగా జిల్లా సోషల్ మీడియా కొ కన్వీనర్ గా నియామక పత్రాన్ని అందించారు. నూతన జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ గా నియామక పత్రాన్ని అందుకున్న హరీష్ పాటిల్ మాట్లాడుతు నాపై విశ్వసన్ని ఉంచి సంగరెడ్డి జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ గా నియమించిన జిల్లా అధ్యక్షురలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి కి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి, జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ కి, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలని, పెద్దలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా వారి నమ్మకాన్ని పార్టీ శ్రేణుల సహకారంతో వృధా కనివ్వనని అన్నారు.

# గారడీల కాంగ్రెస్ సర్కార్



**ప్రజాపక్షం/గజ్వేల్:** ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడేం కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతుల సంక్షేమం కోసం పనిచేశామని, ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీరు అందించి ఆత్మహత్యలు లేని తెలంగాణగా అభివృద్ధి చేశామని, రైతుకు అండగా ఉంటూ రైతు భీమా, ఉచిత విద్యుత్తు, గిట్టుబాటు ధర కల్పిస్తూ దేశానికే అన్నం పెట్టే రాష్ట్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరువుతో రైతులు అల్లాడుతుంటే పట్టించుకోవడం లేదని, పంటలు చేతికి వచ్చే సమంయలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నట్లు తెలిపారు. కాలువల ద్వారా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నప్పటికీ, అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా పంట పొలాలకు సాగునీరు అందించి ఆదుకోవాలని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడేం కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా తెలుగు నూతన సంవత్సర వేడుకలు




**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రంలోని శ్రీ నారాయణ పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు క్రోధి నామ (తెలుగు నూతన సంవత్సరం) సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. ఉగాది చరిత్ర, ప్రాముఖ్యత గురించి కరస్పాండెంట్ భానుచందర్ వివరించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని, విశ్వాసం కలిగి ఉండాలని అన్నారు. ఘణపూర్ మండల ప్రజలకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు, శ్రేయోభిలాషులందరికీ తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఉగాది పచ్చడి మరియు రుచికరమైన బక్షాళుల కోసం సాంప్రదాయ వంటకాన్ని తయారు చేసి అందరికీ అందిస్తారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మైక్రో ఎటిఎం ద్వారా పాసుబుక్కుల ప్రింటింగ్ సేవలు



**ప్రజాపక్షం/నిజాంపేట్:** దేశంలోనే మొదటిసారిగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో ఇదివరకు ఎప్పుడూ లేనివిధంగా మైక్రో ఏటీఎం ద్వారా సిద్ధిపేట రీజియన్ నిజాంపేట్ బ్రాంచ్ నస్కల్ గ్రామంలో ఏపీజీవీబీ బ్యాంక్ మిత్ర అవదుత మురళి వద్ద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మురళి కృష్ణ మాట్లాడుతూ గ్రామంలోనే బ్యాంకు సేవలు అభిస్తాయని అన్నారు. అదేవిధంగా అటల్ పెన్షన్ యోజన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్స్ యొక్క సేవలు బ్యాంకు మిత్ర వద్ద ప్రజలకు సేవలు అందించబడతాయని అన్నారు. ఖాతా పాసుబుక్కుల ప్రింట్ తీసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐరిక్స్ ఛానల్ మేనేజర్ డి.వెంకటేష్, బ్యాంకు మిత్ర కీసరి రవి, నాతి లక్ష్మా గౌడ్, సంతోష్ రెడ్డి, బాల నర్సయ్య, నిజాంపేట బ్యాంక్ మిత్ర బృందం గ్రామ ప్రజలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# కొమురవెల్లిలో ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/కొమురవెల్లి:** కొమురవెల్లిలో శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అగ్నిగుండాల వారంతో ముగిసాయి. ఆదివారం సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వేదవాయిద్యాల మధ్యన స్వామి వారి కళ్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్ద ముందుగా గణపతి పూజ గౌరీపూజ అఖండ దీపారాధన నవగ్రహ పూజ చేసి జగద్గురు పంచాచార్య దిక్పాలన ప్రధాన కలశ స్థాపనారాదములు శ్రీ భద్రకాళి వీరభద్ర సుంకు పూజ అనంతరం అగ్నిగుండ ప్రజ్వలన చేసి ఉదయం ఐదు గంటలకు ఆలంపల్లి కెంపిన మఠాధీశ్వరులు శ్రీ చెన్న బసవ ప్రభు మహాస్వామి వారికి పాదపూజ చేశారు.వీరభద్ర మహోత్సవం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం చేసి, మంగళ హారతి తీర్థ ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో కేదారినాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ పూజారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్బు బిళ్లపై ఉగాది చిత్రం




**ప్రజాపక్షం/గజ్వేల్:** శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని గజ్వేల్ కు చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు రామరాజు ఉగాది చిత్రాన్ని సబ్బుబిళ్లపై అద్భుతంగా చిత్రించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రోధి నామ సంవత్సరం అందరికి శుభాకాంక్షలు కలగాలని, తీపి, చేదు కలిసిందే జీవితం, కష్టం, సుఖం తెలిసిందే జీవితమని స్పష్టం చేశారు. జీవితంలో ఆనందోత్సవాలన్ని పూయించేందుకే ఈ సంవత్సరం వస్తుందని, సమాజంలోని ప్రతి ఒక్కరికి అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రేటర్ వరంగల్ పరిధి 56వ డివిజన్ పోలీసు కాలనీకి చెందిన ప్రశాంత్ సౌజన్యల కూతురు ధన్వి పలేట్ బక్కి యాదగిరి మనువడు వీవెన్ మొదటి సంవత్సర పుట్టిన రోజు వేడుకల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పోరేటర్ సిరంగి సునీల్, డివిజన్ అధ్యక్షుడు బీరం రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొంక హరిబాబు, కందుకూరి పూర్ణచందర్, రజనీకాంత్, మర్రి ప్రభార్‌తోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ తిరుపతి




**ప్రజాపక్షం/సంగెం:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలంలోని గవిచర్ల లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేశ్‌తో కలిసి పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మామునూరు ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజల సహకారం ఉండాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలపై ప్రత్యేకంగా పోలీసు నిఘా ఉంటుందన్నారు.

## వరుణ్‌కు శాలువాలతో సన్మానం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నతమైన చిలుకూరి ఎక్సలెన్సీ కాలేజీలలో సీటును సాధించిన పిల్లుట్ల గ్రామానికి చెందిన దాసరి వరుణ్ ను సోమవారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలతో ముంచేత్తారు. చదువులో మరింత ప్రతిభను సంపాదించి, ఉన్నత చదువులు చదివి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను అందుకుని అందరి మన్ననలు అందుకుని, తల్లి దండ్రులకు,గ్రామానికి మంచి పేరును సంపాదించి పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీల్డ్ అసిస్టెంట్ జోగు రాములు,జింక అంజయ్య, దాసరి నర్సిములు, దాసరి లింగం, పాల్గొన్నారు.

## రెండు రోజుల పాటు కొనసాగనున్న జాతర ఉత్సవాలు...



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం లోని పిల్లుట్ల గ్రామ శివారులో వెలసిన భక్తుల కొంగుబంగారంగా కొలువైన శ్రీభర్మస్వామి జాతర మహోత్సవాలు నేటి మంగళవారం నుండి రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాలలో ఒకటైన పిల్లుట్ల శ్రీభర్మస్వామి దేవాలయంలో ప్రతి శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి ఏటా తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం రోజున భర్మస్వామి జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభించడమే కాకుండా స్వామివారి రథోత్సవ వేడుకలు కూడ ఉగాది రోజునే నిర్వహించడం ఆనాయితీ. మధ్యాహ్నం 4 గంటల తర్వాత భర్మస్వామి రథోత్సవం, బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. రెండు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవాలలో కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని, ఆటపాటలతో ఆనందంగా గడిపి సందడి చేస్తారు.

# గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి



**ప్రజాపక్షం/హనుమకొండ:** లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు సెగ్మెంటులో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హన్మకొండలోని చల్లా నివాసంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వరంగల్ సెగ్మెంట్లో పార్టీ ఎవరిని సూచించిన ఆ అభ్యర్థి గెలుపుకు ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులందరూ ఐక్యతతో కృషి చేసి కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రాజెక్టుల్లో జరిగిన మేలు గురించి గడప గడపకు వెళ్లి వివరించాలన్నారు. పార్టీకి నమ్మక ద్రోహం చేసి పార్టీలు మారిన వారితో నష్టం లేదు. మళ్లీ పార్టీలో వారు వస్తానన్నా తీసుకునే ప్రసక్తే లేదన్నారు. నేను పార్టీ మారుతున్నాని కొంత మంది అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. అలాంటి ప్రచారాలను ఎవరూ నమ్మొద్దన్నారు. ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ సీఎం కేసీఆర్ ఉంటే ఉంటా. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ వంద రోజులు దాటినా హామీల అమలు ఎటుపాయే.. లోక్‌సభ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గింది. వ్యతిరేకత మొదలైంది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పసునూరి సారంగపాణి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, నాయకులు పులుగు సాగర్‌రెడ్డి, దొనికెల మల్లయ్య, కోడూరు సదయ్య, ఉండీల రాజు, బొంపెల్లి దిలీప్‌రావు, షాబోతు శ్రీనివాస్, గుగులోతు వీరమ్మ, మునుకుంట్ల చంద్రశేఖర్, యారా బాలకృష్ణ, పురం శ్రీనివాస్‌తోపాటు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగొద్దు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** వేసవిలో తాగునీటి సరఫరాలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం సాగునీటి సరఫరాపై మండలంలోని ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. బోర్లు, చేతిపంపులు, బావుల ద్వారా ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. ఇప్పటి వరకు తాగునీటి సరఫరాలో మండలంలోని ఏ గ్రామంలో లేవన్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు పడిపోయాయన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోర్లు, చేతిపంపులు అవసరమైన చోట వ్యవసాయ బావుల నుంచి నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఏపీడీ, ఏపీఎం, మండల సమైక్య సంఘం అధ్యక్షులతో సమీక్ష ఏపీఎం ఆకుల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎండల కారణంగా వడదెబ్బ, ఇతర ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఈజీఎస్ పనుల్లో పాల్గొంటున్న ప్రజలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, ఎండ తీవ్రతకు అనుగుణంగా పనివేళలు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు వెంకన్న, శివకుమార్, హేమలత, హరిత, కల్పన, శ్రీనివాస్, సంతోష్, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అనంతుల నరేందర్



**ప్రజాపక్షం/కొండపాకః** సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రంలోని దుద్దెడ గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతుల నరేందర్‌ను నియమిస్తూ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి సోమవారం రోజున హైదరాబాదులోని ప్రజా భవనం వద్ద నియామక ప్రతాన్ని అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన పదవిని తూచా తప్పకుండా నిస్వార్థంగా పార్టీ ప్రతిష్ట కొరకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు విజయానికి జిల్లా వ్యాప్తంగా పర్యటించి భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.ఈ పదవి రావడానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే తూముకుంట నరసారెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండపాక కుకునూరుపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చిన్న శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షులు బట్ట పరశురాములు, ఎస్సీసెల్ అధ్యక్షులు మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, ఆరే భాస్కర్, చిరంజీవి, పంజా అఖిల్, వెంకటేశం, వెంకటరమణ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుండ బ్రహ్మయ్య జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/సంగెం:** గుండ బ్రహ్మయ్య జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని మామునూరు ఏసీపీ తిరుపతి అన్నారు. మండలంలోని గవిచర్ల గ్రామంలో సోమవారం గుండ బ్రహ్మయ్య దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామస్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మామునూరు ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ.. గుండా బ్రహ్మయ్య జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ జాతరలో ఎలాంటి రాజకీయ ప్రభ బండ్లు నిషేదమన్నారు. జాతరను శాంతియుతంగా జరుపుకోవాలని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొంతం యాదగిరి, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డితోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌కు సన్మానం



**ప్రజాపక్షం/జహీరాబాద్:** ఇటీవల జరిగిన జహీరాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీలేకుండా ఏక గ్రీవంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతనంగా అధ్యక్షునిగా బి.గోపాల్ ఎన్నికైన సందర్భంగా సీని యర్ న్యాయవాది ఇప్పేపల్లి గోపాల్ ను ఆదివారం రాత్రి ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బి గోపాల్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్క రించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఈ సంద ర్భంగా అన్నారు. భారత రాజ్యాంగం నిర్మిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థాపించిన సంస్థ ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ సంస్థలో క్రియాశీలక పాత్రపోషి స్తున్న కుప్పనగర్ ఉపాధ్యాయులు దశరథ్ గత 25 సంవత్సరాలనుండి వివిధ బాధ్యతలు నిర్వహించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అనేక ప్రాంతాల్లో పర్యటించి అంబేద్కరిజాన్ని, బౌద్ధధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేసారు. వివిధ రంగాలలో ప్రచారం చేసినందుకు వారి ప్రతిభను గుర్తించి వారికి మయూరి అవార్డులో భాగంగా ప్రశంస పత్రాలతో పాటు మెడల్ ను అందజే శారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ సభ్యులు రామ్ తీర్థ్ నర్సింలు, ఉషాకాంత్, విష్ణు, కృష్ణ, సునీల్, డాక్టర్ సీతారామరాజు, ఇప్పేపల్లి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటుచేసుకోవాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామాలలో ప్రజలందరు సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తొర్రూరు, శాతపురం గ్రామాలలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఇద్దరు కంటే ఎక్కువగా వాహనాల మీద వెళ్తుండడం, అతి వేగం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణానికి యువత, ప్రజలు సహకరించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని తీగారం గ్రామానికి చెందిన శ్రీశైలం మృతిచెందడంతో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తీగారం గ్రామానికి చెందిన బైకాని శ్రీశైలం మృతిచెందడంతో ఎమ్మెల్యే సోమవారం ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబానికి ఎల్లవేలలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులతో మాట్లాడి శ్రీశైలం కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, బైకాని ఐలేష్, రాజేష్, తదితరులున్నారు.

## బూత్ కమిటీ సమ్మేళనాలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం దిశగా పోలింగ్ బూత్ కమిటీల సమ్మేళనాలు క్లస్టర్లవారీగా ఈనెల 10న నియోజకవర్గంలో జరిగే బూత్ కమిటీ సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాలకు సంబంధించిన క్లస్టర్ స్థాయి పోలింగ్‌బూత్ కమిటీల సమ్మేళనం కొడకండ్ల మండల కేంద్రంలో, తొర్రూరు అర్బన్ రూరల్, పెద్దవంగర, రాయపర్తి మండలాల క్లస్టర్ స్థాయి బూత్ కమిటీల సమ్మేళనం తొర్రూరులో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, జిల్లా నాయకుడు కమ్మగాని శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శులు మారం రవి కుమార్, నిరంజన్, సోమేశ్వర్, రామారావు, కె శివప్రసాద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి బక్కయ్య ఇటీవల తాడిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందగా మృతుని కుమార్తె అంజలి 10వ తరగతి బ్యాచ్ స్నేహితులు వారి కుటుంబానికి మేమున్నామంటూ రూ.10,100లు సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, సంపత్, సృజన్‌కుమార్, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మరణానికి కారకుడైన ఏఇ సస్పెండ్ చేయాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** పాలకుర్తి మండల కేంద్రంలో పనిచేస్తున్న విద్యుత్ కార్మికుడు బి శ్రీశైలం మరణానికి కారకుడైన ఏఈ రణదీర్‌ను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా రాపర్తి రాజు విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం జనగామలోని ఎస్ఈ కార్యాలయంలో ఏడిఇ ఎం ప్రభావతికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడుతూ ఈ నెల 6న పాలకుర్తి సెక్షన్ వల్లిడి గ్రామ పరిధిలోని కురుమగూడెం ఏరియాలో ట్రాన్స్‌ఫార్మర్ వర్క్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై బైకాని శ్రీశైలం మృతి చెందాడన్నారు. మధ్యాహ్నం సమయంలో ఎల్‌సి తీసుకోవడానికి వీలు లేకున్నా ఏఈ రణదీర్ ఎల్‌సి తీసుకొని పని చేయించాడన్నారు. నిబంధనల ప్రకారం ఎల్‌ఎం, ఏఎల్‌ఎం పై అధికారి మాత్రమే ఎస్సీ తీసుకోవాలన్నారు. ఆపరేటర్ చెప్పినా వినకుండా ఎల్‌సి తీసుకొని విద్యుత్ కార్మికుడి చావుకు ఏఈ కారకుడయ్యాడన్నారు. అధికారులు స్పందించి బైకాని శ్రీశైలం చావుకు కారకుడైన ఈఇ రణదీర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

## వడదెబ్బతో మహిళ మృతి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ పట్టణానికి చెందిన ఓ మహిళ వడదెబ్బకు గురై హాస్పటల్‌లో చికిత్స పొందుతు సోమవారం ఉదయం మృతి చెందింది. స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం..జనగామ పట్టణంలోని సంజయ్ నగర్‌కు చెందిన బొమ్మగాని నిర్మల (65) అనే మహిళ ఆర్‌టిసి చౌరస్తా సమీపంలోని ఓ హోటల్‌కు దినసరి కూలీగా పనిచేస్తుంది. రెండు రోజుల క్రితం ఇంటి నుండి నడుచుకుంటే పనికి వెల్లిన నిర్మల అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్య సేవలు అందించారు. ఆదివారం అర్ధరాత్రి తరువాత పరిస్థితి విషమించడంతో జనగామ ఏరియా హాస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందున్న నిర్మల సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాని కుమారుడు బొమ్మగాని శ్రీకాంత్ ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న జనగామ ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సిపిఎం భువనగిరి అభ్యర్థి ఎండి జహంగీర్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కాంగ్రెస్ టిపిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్, 16వ వార్డు కౌన్సిలర్ రాంచందర్, 17వ వార్డు కౌన్సిలర్ జక్కుల అనితతో పాటు జర్నలిస్టులు పార్నంది వెంకటస్వామి, జాల రమేష్, ఆనంద్, కిరన్, శ్రీకాంత్ రెడ్డి, హింగె మాధవరాజు, రాణాప్రతాప్, ఉప్పలంచి నరేందర్ సురుగు బిక్షపతి, కాసాని ఉపేందర్, యాసు వ్‌తో పాటు పలువురు పరామర్శించారు. పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

## గత ప్రభుత్వ బాధ్యత రహితం వల్లనే మేడిగడ్డ కుంగుబాటు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** లక్ష కోట్లతో నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండె కాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ గత ప్రభుత్వ తప్పిదం వల్లనే ప్రాజెక్టు కుంగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ ని సోమవారం సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ రాష్ట్ర బృందం మేడిగడ్డను సందర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ కి ఉదయం 11 గంటలకు చేరుకొని బ్యారేజి లోని కృంగిన 19,20,21 పిల్లర్ల ను పరిశీలించారు.సాగు నీటి ప్రాజెక్ట్ లో నే అత్యధిక ఖర్చు చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని, మేడిగడ్డ కుంగిపోవడం పై న్యాయ విచారణ చేసి బాధితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును కొనసాగించాలా లేదా తర్వాత ఆలోచించండి కానీ ప్రస్తుతం రైతులతో రాజకీయాలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యలు మరమ్మత్తులు చేపట్టి రైతులకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు,సీపీఎం పార్టీ పట్టణ అధ్యక్షులు వెలిశెట్టి రాజయ్య ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలేం రాజేందర్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం చిన్న రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, ఆకుదారి రమేష్, ఆత్కూరి శ్రీధర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉగాది తెలుగు కాలమానిని ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జనగామటౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీహనుమత్ రామనాథ సహిత శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు, కవి, రచయిత డాక్టర్ మోహనకృష్ణ భార్గవ రచించి, నిర్మించి ప్రచురించిన సత్సంప్రదాయక తెలుగు కాలసూచిక (క్యాలెండర్)ను సోమవారం పలువురు ప్రముఖుల సమక్షంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది తెలుగు కాలమానిని వైభవంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ కాలసూచిక సామాన్యులకు కూడా సులభంగా అర్థయ్యే రీతిలో ఉందని, మల్టీకలర్‌లో ఆకర్షణీయంగా, విద్యార్థులకు సైతం ఆస్తికరంగా కనబడుతుందన్నారు. ఎన్నో వ్యయప్రయాసలతో ఓర్పు, ఎంతో శ్రమతో సాంప్రదాయక ఉగాది క్యాలెండర్‌ను ముద్రించడం జరుగుతుందన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి, జక్కా నర్సిరెడ్డి, కందాడి మల్లారెడ్డి, యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, పాశ శ్రీశైలం, కళ్లెం నాగరాజు రెడ్డి, ఉమాకర్‌రెడ్డి, జక్కా ఉపేందర్, పూర్ణచందర్, వేణుగోపాల్, రవి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఝాన్సీరెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన మిరియాల జితేందర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోతే ఆకుటుంబానికి తీరని బాధ కలుగుతుందని, ఆలోటు పూడ్చలేనిదన్నారు. కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నాయకులు నిరంజన్ రెడ్డి, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, నాగిరెడ్డి, తదితరులున్నారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడండి..

(మొదటిపేజీ తరువాయి)

విభజించి మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో సింగరేణి కాకుండా 68585 మంది జనాభా ఉన్నారని, 13717 మిషన భగీరథ కుళాయిలు, 3347 సింగరేణి కుళాయిలు ద్వారా ప్రతి రోజు మంచి నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు 20.70 ఎం ఎల్ డి నీళ్లు సరఫరా జరుగుతున్నదని అన్నారు. 81 బోర్ వెల్స్, 30 చేతి పంపులు, 2 ట్యాంకర్ల అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రానున్న వారం రోజుల్లో అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూఎస్ ఈ ఈ నళిని, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, డిఆర్డీఓ నరేష్, సిపిఓ శామ్యూల్, మత్స్యశాఖ అధికారి అవినాష్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్:** సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సీకేఎం కళాశాల సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందించి చిత్రకళ పట్ల ఆసక్తి, అభిరుచి గల చిన్నారులను ప్రోత్సహించే దిశగా వారికి వచ్చే విద్యా సంవత్సరం నుండి వారానికి రెండు ఉచిత శిక్షణా తరగతులను తమ సంస్థ తరుపున నిర్వహిస్తామని అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల తెలిపారు. .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు టీవీ అశోక్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపి అభ్యర్థి వెంకట్రాంరెడ్డిపై కేసునమోదు

**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి.. ఏలాంటి అనుమతి లేకుండ ఒక ఫంక్షన్ హాల్‌లో ప్రచారం చేసిన బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డిపై సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీ టౌన్ సిఐ కథనం వివరాలు ఇలా ఉన్నాయి. ఏలాంటి అనుమతి లేకుండ ప్రభుత్వ ఉద్యోగులతో బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారని ఫ్లైయింగ్ స్కాడ్ ఇంచార్చి కడవేర్గు పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి 9.55 గంటలకు విది నిర్వహణలో ఉండగా రంగధాంపల్లి శివారులో రెడ్డి ఫంక్షన్‌హాల్ రాజకీయపార్టీ నాయకులు ఏలాంటి జిల్లా పరిధిలో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం రాగానే సిబ్బందితో వెళ్లగా 10.10గంటలకు రెడ్డి ఫంక్షన్ హాల్‌కు చేరుకోగానే తమను గమనించి అక్కడున్న వారు వాహనాలను వదిలి పరుగులు తీసినట్లు తెలిపారుఎన్నికల నియామవళీ ఉల్లంఘణ కింద బిఆర్ఎస్ ఎంపి వెంకట్రామ్‌రెడ్డి, సుడా మాజీ చైర్మన్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సిఐ తెలిపారు. సోమవారం సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌లు కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు.

## ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్‌పై విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో అనేక అక్రమాలకు పాల్పడుతున్న సూపరింటిండెంట్ జగదీష్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ములుగు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవి చందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి జాకారం గ్రామానికి చెందిన గుగులోత్ రవీందర్ జీవంతరావుపల్లి గ్రామంలో పని నిమిత్తం వచ్చి వెళ్తున్న క్రమంలో యాక్సిడెంట్‌లో స్రృహ కోల్పోగా ములుగు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళారని, డాక్టర్లు లేకపోవడంతో సుమారుగా 16 సార్లు సూపరింటిండెంట్ జగదీష్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించకపోవడంతో భావోద్వేగానికి లోనై తిట్టిన మాట వాస్తవమేనని ఎవ్వరు ఉన్న ఇలానే ప్రవరిస్తారని తెలిపారు.పత్రికలు, సోషల్ మీడియా వాళ్లు కావాలని పని గట్టుకొని నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, జరిగిన వాస్తవాలు ఆయన నాతో మొదటగా మాట్లాడిన మాటలు రికార్డు చెయ్యకుండా నేను తర్వాత మాట్లాడిన మాటలు మాత్రమే సోషల్ మీడియాలో పెడుతున్నారని, ప్రజలు గమనించాలని కోరారు.

# ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆనందంగా జీవించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వసంత ఋతువు అందరి జీవితాలలో నవవసంతం నింపాలన్నారు. ఉగాధి నుంచి కొత్త సంవత్సరం ప్రారంభం అవుతుందని, చేపట్టిన ప్రతి పనిలో విజయం కలిగి అందరి ఆశలు, ఆకాంక్షలు



నెరవేరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. తెలుగువారి పండుగలన్ని చాలా గొప్పగా ఉంటాయని, వాటిలో ఉగాది పండుగ ఎంతో ప్రత్యేకమని అన్నారు. తెలుగు ప్రజలకు ఉగాది పండుగతోనే తెలుగు సంవత్సరం ప్రారంభం అవుతుందని, సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి, చెడులను, కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని, అభివృద్ధిలో మన జిల్లా ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. .

## అమ్మ ఆదర్శపాఠశాల పనులు వేగంగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండల కేంద్రంలోని స్టేషన్ ఆవల గల ఎంపీపీఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ ద్వారా గుర్తించిన పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, కాంపౌండ్‌వాల్, గేట్, తదితర మౌళిక సదుపాయాల గురించి ఆరా తీశారు. పాఠశాల మరమ్మత్తు పనులన్నీ 15రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కోమల్ల గ్రామ పంచాయితి పరిధిలో గల మిషన్ భగీరథకు ఎస్‌డీఎఫ్ కింద పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగు



నీరు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ తనిఖీలలో జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఈవో రాము, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు, మండల నోడల్ ఆఫీసర్ రఘునందన్, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి:** ల్లాలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలని, అదే సమ యంలో సమాంతరంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాల గురించి తెలియజేసే గోడ పత్రికను పోలిసు అధికారులతో కలిసి ఎస్పి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎస్పి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలిసుశాఖ పటిష్ఠ చర్యలు చేపడుతుందని అన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువత భావిభారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. దీనిని గుర్తించి డ్రగ్స్‌వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌తో పాటు, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరెట్




మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయన్నారు. భావితరాలు మాదకద్రవ్యాలపై ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని ఎస్పి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పి జి.రామ్మోహన్ రెడ్డి, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్, టాస్క్ ఫోర్స్/ సీసీఎస్ ఇన్స్పెక్టర్ రవీందర్, జిల్లా పరిధిలోని ఎస్ఐ లు పాల్గొన్నారు.

## జై తెలంగాణ అనని సిఎంకు ఓటు అడిగే నైతిక హక్కు లేదు

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమంలో సిఎం రేవంత్‌రెడ్డి ఏనాడైన పాల్గొన్నారా ? జై తెలంగాణ అని నినాదించారా? ఉద్యమ కారులపై తుపాకి ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి తెలంగాణ ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కులేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. జిల్లాలను రద్దు చేస్తానంటున్న సిఎం రేవంత్‌రెడ్డికి వచే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు రద్దు చేయాలని హరీష్ రావు పిలుపునచ్చారు. దుబ్బాకలో చెల్లని రఘునందన్ రావు మెదక్ పార్లమెంట్‌లో చెల్లుతుందా అని ఎద్దేవా చేశారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్, బిజెపిలకు బుద్ధి చెప్పాలన్నారు. తాను ఊపిరి ఉన్నంత వరకు మీకోసం పనిచేస్తానని, సిద్దిపేట అభివృద్ధి శ్వాసగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలు అటకెక్కాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్. బిజెపిలకు గట్టిగా బుద్ది చెప్పాలని పిలుపునిచ్చారు.

**నావిజయంలో యువతదే కీలక పాత్ర- పార్లమెంట్**



**అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి**

నా విజయంలో యువతనే కీలక పాత్ర నిర్వహించాలని బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి నిర్వహించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్‌గా అందరి మన్ననలు పొందానని, ఎంపీగా అవకాశం కల్పించాలని కోరారు. కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో సిద్దిపేటను కెసిఆర్, హరీష్‌రావు సహాకారంతో సిద్దిపేటను దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అత్యధిక కాలం ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన ఘనత నాకు దక్కిందన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ మండలాల ముఖ్యనేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లూరు శ్రీ హేమాచల సన్నిధిలో కాళేశ్వరం జోన్ సిసిఎఫ్ ప్రభాకర్

**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం మల్లూరు శ్రీ లక్ష్మి నరసింహస్వామి సన్నిధిలో కాళేశ్వరం జోన్ సిసిఎఫ్ ప్రభాకర్ తాడ్వాయి మండల ఫారెస్ట్ రెంజి అధికారి సత్తయ్య స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ రాఘవ చార్యులు ఈశ్వర్ చంద్ శర్మ స్వాగతం పలికారు. తరువాత గర్భాలయంలో స్వామి వారి కి వారి పేరు మీద అర్చన చేసి స్వామి వారి విశిష్టత వివరించి తదుపరి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు శేషవస్త్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో మండల ఫారెస్ట్ డిప్యూటీ రెంజి అధికారి కోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

## పోలీసులు ఎండాకాలంలో తగు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఎండలు మండిపోతున్న తరుణంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకెన్ సూచించారు. ఏఆర్ డిఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో ఆర్ఐ వెల్ఫేర్ సాంబశివరావు జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది కొరకు ఏర్పాటు చేసిన త్రాగునీటి వాటర్ డిస్పెన్సర్ రిఫ్రిజరేటర్ ను ఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ జోగుల చన్నయ్య, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ వెల్ఫేర్ సాంబశివరావు, ఆర్ఐ సోమల్లు, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట పురపాలక సంఘం నందు వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులతో మంచినీటి సరఫరా, ఇంటి పన్నులపై సిబ్బంది ఆదాయ వ్యయాలపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ ఇ. జోనా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ జి.సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ, త్వరితగతిన పనులు పూర్తి చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు అందే మంచి నీటి సరఫరా,శానిటేషన్ పనులపై దృష్టి సారించాలన్నారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం పట్టుకున్న ఐనవోలు పోలీసులు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేస్తున్న షాపులపై సోమవారం ఐనవోలు పోలీసులు తనిఖీలు చేశారు. ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారం మేరకు పున్నేలు గ్రామంలో రావుల రాజు ఇంటి వద్ద తనిఖీలు చేయగా అతని ఇంట్లో 7821/ రూపాయల విలువగల మద్యం ఉన్నట్లు వివరించారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ వెల్లడి.